సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023





లింగమంతుల స్వామిని దర్శించుకుంటున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు



ఓ లింగా.. అంటూ శిగమూగుతున్న మహిళ



భక్త జన గట్టు



భక్తజనంతో నిండిపోయిన పెద్దగట్టు పరిసరాలు

దురాజ్‌పల్లి పెద్దగట్టు జనగట్టును తలపించింది. లింగమంతుల స్వామి జాతరలో భాగంగా రెండవ రోజు సోమవారం భక్తులు స్వామి, అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు తరలివచ్చారు. భేరీ చప్పుళ్లు, గంపలు, బోనాలతో మహిళలు, శివసత్తుల నృత్యాలు, ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో గొల్లగట్టు పరిసరాలు మార్మోగాయి. లింగన్న దర్శనానికి భక్తులు బారులుదీరారు.

- సూర్యాపేట, చివ్వెంల

- వివరాలు 10లో

న్యూస్‌రీల్

డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ చిన్నానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైక్రియాటిస్ట్ 1, గైనకాలజీ 2, జనరల్ సర్జరీ 2, అనస్తీషియా 2 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వేతనం నెలకు లక్ష రూపాయలు చెల్లించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు నేటి నుంచి ఈనెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకోసం జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని కోరారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టుల కోసం..

భువనగిరిలోని మూడు బస్తీ దవాఖానాలు, చౌటుప్పల్‌లోని పాలియేటివ్ కేర్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్లగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు పేర్కొన్నారు. ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైన వారిని ఇంటర్వ్యూ ద్వారా మెరిట్, రోస్టర్ విధానంలో నియమించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులుదరఖాస్తులను ఈ నెల10వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య డీఎంహెచ్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్ సాధనే లక్ష్యం



పారిశుద్ధ్యంపై ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యాదగిరిగుట్ట : స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్ సాధనే లక్ష్యంగా చేపట్టిన మన యాదాద్రి - మన బాధ్యత కార్యక్రమంలో పట్టణ ప్రజలు, దుకాణదారులను భాగస్వాములు చేసేందుకు మున్సిపల్ యంత్రాంగం, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రచార రథంపై ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి తడి, పొడి చెత్తను వేరు చేయడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ చెత్త వాహనాల్లో వేయాలని సూచించారు.

ముగిసిన ఉపాధ్యాయుల దరఖాస్తుల పరిశీలన

భువనగిరి : ఉపాధ్యాయ బదిలీల, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారి హార్డు కాపీలను పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపరిచే కార్యక్రమం సోమవారం ముగిసింది. దరఖాస్తు చేసుకున్న 1,803 మంది ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాలను మంగళవారం పాయింట్ల వారీగా ప్రకటించనున్నారు. ఇందులో ప్రత్యేక కేటగిరీకి చెందిన వారు 70 నుంచి 80, స్పౌజ్ కేటగిరీలో సుమారు 250 మంది, ఉపాధ్యాయ సంఘాలకు చెందిన వారు 24 మంది ఉండే అవకాశం ఉంది.

నేడు పాఠశాలలకు సెలవు

భువనగిరి : సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు శ్రీలింగమతుల జాతర సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం సెలవు ప్రకటించినట్లు డీఈఓ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పాఠశాలల యాజమాన్యాలు సెలవు దినంగా పాటించాలని సూచించారు.

యాదాద్రికి రూ.200 కోట్లు

బడ్జెట్‌లో నృసింహ క్షేత్రానికి ప్రాధాన్యం.. భక్తులకు సమకూరనున్న వసతులు

- మూసీ శుద్ధీకరణకు అరకొరగానే నిధులు
- సొంత జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు
- పెరగనున్న దళితబంధు యూనిట్లు
- 90వేల మంది రైతులకు రుణ విముక్తి
- స్థానిక సంస్థల ఖాతాల్లోకి నేరుగా నిధులు



సాక్షి, యాదాద్రి : ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మూసీ, యాదాద్రికి ప్రాధాన్యం దక్కింది. వీటితో పాటు రైతు రుణమాఫీ, దళితబంధు, సొంత జాగా ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి కేటాయింపులు చేయడంతో జిల్లాలో కొంత మేరకు లబ్ధి చేకూరనుంది. మధ్యాహ్న భోజనం వంట మహిళల నెలవారీ గౌరవ వేతనం పెంచడం ద్వారా 1,250 మందికి ప్రయోజనం చేకూరనుంది. పంచాయతీ రాజ్, ఆర్ అండ్‌బీ రహదారులు మరమ్మతులకు నోచుకోనున్నాయి. అయితే మూసీకి కేటాయించిన నిధులు దేనికీ చాలవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యా రంగానికి నిధుల కేటాయింపుపై ఆయా వర్గాలు పెదవి విరిస్తున్నాయి.

స్థానిక సంస్థలకు ఊరట

జెడ్పీ, మండల పరిషత్‌లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు ఊరట కలగనుంది. వివిధ పనుల కోసం ఇస్తున్న నిధులు ఇక నుంచి నేరుగా వారి ఖాతాల్లో జమ కానున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కొంత మేరకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

1,100 చొప్పున దళితబంధు యూనిట్లు

దళితబంధు పథకం కింద గత బడ్జెట్‌లో నియోజకవర్గానికి 100 చొప్పున యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 338 యూనిట్లు పంపిణీ చేశారు. ఈసారి నియోజకవర్గానికి 1,100 చొప్పున యూనిట్లు ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించడంతో దళితుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 4వేల మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

తొలగనున్న ఇబ్బందులు

ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక దివ్యక్షేత్రంగా రూపుదిద్దుకున్న యాదాద్రి దేవస్థానం అభివృద్ధికి రూ.200 కోట్లు కేటాయించారు. వైటీడీఏ ఆధ్వర్యంలో రూ.1,200 కోట్లతో ప్రభుత్వం యాదాద్రిని అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. గత మార్చి 28న యాదాద్రి ఆలయ పునరుద్ధాటన జరిగిన అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో పెరిగారు. అందుకు అనుగుణంగా వసతుల కల్పనకు కేటాయించిన నిధులు ఖర్చుచేయనున్నారు.



అర్హులైన రైతులకు రుణ విముక్తి



బడ్జెట్‌లో రైతు రుణమాఫీకి రూ. 6,385 కోట్లు కేటాయించారు. దీంతో రైతులకు రుణ విముక్తి కలగనుంది. గత ఎన్నికల ముందు రూ.1లక్ష లోపు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు ముందుగా రూ.25 వేల లోపు, ఆ తర్వాత రూ.50లోపు రుణాలను మాఫీ చేసింది. ఒక లక్ష లోపు రుణ మాఫీకి అర్హులైన రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. ఈసారి బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో రూ.లక్ష లోపు రుణాలున్న సుమారు 90 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

ప్రజారంజక బడ్జెట్



ఇది ప్రజారంజక బడ్జెట్. అన్ని వర్గాల ప్రజల అవసరాలకు అనుకూలంగా ఉంది. సొంత జాగా ఉండి ఇల్లు లేని వారికి ప్రభుత్వం రూ. 3లక్షలు ఇవ్వనుంది. ప్రతి నియోజకవర్గానికి ఇచ్చే 2వేల ఇళ్లు కాకుండా అవసరాన్ని బట్టి కేటాయిస్తారు. పేదలకు సర్కారు వైద్యం మరింత చేరువకానుంది. మొత్తంగా హరీష్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఉంది.

-పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, భువనగిరి


అందరికీ ఆమోదయోగ్యంగా ఉంది



బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉంది. వ్యవసాయం, మహిళల అభ్యున్నతికి, వైద్యరంగానికి పెద్ద పీట వేశారు. దెబ్బతిన్న రోడ్లకు నిధులు కేటాయించారు. నిరుద్యోగ యువతకు రిక్రూట్‌మెంట్‌కు ప్రత్యేక కేటాయింపులు చేశారు. దళితబంధుతో మరింత మందికి లబ్ధి చేకూరనుంది. ఇళ్ల నిర్మాణ పతకం తెస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు.

-గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్

విద్యారంగాన్ని విస్మరించారు



బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను నిరాశపర్చే విధంగా ఉంది. మన ఊరు – మన బడికి ప్రత్యేకంగా నిధులు కేటాయించ లేదు.ఉపాధ్యాయ ఖాళీల భర్తీ గురించి ప్రస్తావించ లేదు. బడ్జెట్ రాజకీయ కోణంలో ఉందే తప్ప విద్యాభివృద్ధికి ఏమాత్రం దోహదపడే విధంగా లేదు.

-ఎం.సత్తయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

మూసీ అభివృద్ధికి నిధులు



మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.200 కోట్ల కేటాయించారు. అయితే జిల్లాలో వ్యవసాయం, మత్స్య, పాడి పరిశ్రమపై ఆధారపడ్డ వారికి మూసీ కాలుష్యం ప్రమాదకరంగా మారింది. ఎన్నో సంవత్సరాలుగా మూసీ ప్రక్షాళన కోసం ఈ ప్రాంతంలో పోరాటాలు జరుగుతున్నాయి. తాజాగా కేటాయించిన నిధులు ఏ మూలకూ సరిపోవని రైతులు, పర్యావరణవేత్తలు అంటున్నారు.

సొంత జాగా ఉంటే ఆర్థిక సాయం



డబుల్ బెడ్ రూం ఇళ్ల స్థానంలో సొంత స్థలం ఉన్నవారికి రూ.3 లక్షలు ఇవ్వనున్నట్లు బడ్జెట్‌లో పొందుపరిచారు. అయితే నియోజకవర్గానికి రెండు వేల మందికి చొప్పున ఆర్థిక సాయం అందజేస్తే ఆలేరు, భువనగిరి, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఇళ్లు లేని వేలాది మందికి లబ్ధి చేకూరనుంది.

మోసపూరితంగా ఉంది

బడ్జెట్ మోసపూరితంగా ఉంది. మూసీ ప్రక్షాళనకు కేవలం రూ.200 కోట్లు కేటాయించింది. ఈ కేటాయింపులు చూస్తే మూసీని ప్రభుత్వం మరిచిపోయినట్లుగా ఉంది. డబుల్ బెడ్‌రూం కోసం తక్కువ నిధులు కేటాయించారు. ఇది చూస్తుంటే పేదలకు సొంతింటి కల నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు.లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని చెప్పి ఈసారి కూడా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదు. దళితబంధుపై కూడా మోసపూరితంగా వ్యవహరించారు. బీసీలకు కేటాయింపులను తగ్గించింది.

-పీవీ శ్యాంసుందర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



పార్టీ శ్రేణులతో కలిసి వలిగొండలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి
- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ : కాంగ్రెస్ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పాదయాత్రను వలిగొండలోని రామాలయంలో పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మత రాజకీయాలను ప్రోత్సహిస్తూ ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదలు, నిరుద్యోగులు, రైతుల సమస్యలను విస్మరించిందన్నారు. ఎన్నికల హామీలు ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఏకం చేయడమే హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పాదయాత్ర ఉద్దేశం అన్నారు. ప్రజా సమస్యలపై ప్రతి గ్రామంలో కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అంతకుముందు రాజీవ్‌గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, జెడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి, వైస్ ఎంపిపి బాతరాజు ఉమా బాల్నర్సింహ, సర్పంచ్ బొల్ల లలితా శ్రీనివాస్, ఎంపీటీసీలు యశోద, పల్లెర్ల భాగ్యమ్మ రాజు, సునీతానాగేశ్వర్, పాశం సతిరెడ్డి, గరిసె రవి, తుమ్మల యుగంధర్‌రెడ్డి, కంకల కిష్టయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు,నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

ఆలేరురూరల్, భువనగిరి : హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టేందుకు మేడారం వెళ్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఆలేరు, భువనగిరి వద్ద పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఆలేరులో టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ విద్యాసాగర్, దశరథ, శ్రీపాల్‌రెడ్డి శంకరయ్య రేవంత్‌ను సన్మానించారు. భువనగిరిలో మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజు, ఐఎన్‌టీయూసీ నరేష్‌స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి నాయకులు

పేలుడు పదార్థాలు పట్టివేత

- భారీగా జిలిటెన్‌స్టిక్స్, డిటోనేటర్లు స్వాధీనం
- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి : అనుమతి లేకుండా అక్రమంగా ఆటోలో తరలిస్తున్న జిలిటెన్ స్టిక్స్, డిటోనేటర్లను భువనగిరి పోలీసులు పట్టుకున్నారు. భువనగిరిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ రాజేష్ చంద్ర వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా సైదాపురం మండలంలోని రాయకల్ గ్రామానికి చెందిన వీరారెడ్డి వద్ద హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం విశ్వనాథకాలనీకి చెందిన దున్నపోతుల యాదయ్య అనధికారికంగా జిలిటెన్ స్టిక్స్, డిటోనేటర్లను కొనుగోలు చేసి తన ఆటో ద్వారా తీసుకవచ్చి ఆర్డర్ చేసిన వారికి విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో గుండాల మండలం సీతారామపురం గ్రామానికి చెందిన శివరాత్రి యాదగిరికి విక్రస్తున్నారు. శివరాత్రి యాదగిరి ఈ పేలుడు పదార్థాలను సీతారామపురం గ్రామానికి చెందిన వనం కనకరాజుతో పాటు జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం గుమ్మడివల్లి గ్రామానికి చెందిన యేసోబు ద్వారా బావులు, కాల్వలు, వెంచర్లలో రాళ్లను తొలగించేందుకు వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 5న సాయంత్రం యాదయ్య తన ఆటోలో పేలుడు పదార్థాలను తీసుకుని గుండాల మండలానికి వస్తుండగా పోలీసులు మరిపడిగ వద్ద దాడులు నిర్వహించి పేలుడు పదార్థాలను పట్టుకున్నారు. యాదయ్యను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆయనతో పాటు యాదగిరి, కనకరాజు, యేసోబును అరెస్టు చేశారు. వారి నుంచి 400 జిలిటెన్‌స్టిక్స్, 400 డిటోనేటర్లు, కనెక్టింగ్ వైర్ బండిల్ ఒకటి, సెల్ ఫోన్లు నాలుగు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న వీరారెడ్డిని త్వరలో పట్టుకుంటామని చెప్పారు. విలేకరుల సమావేశంలో యాదగిరిగుట్ట ఏసీపీ నర్సింహారెడ్డి, సీఐ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌటుప్పల్‌కు క్రికెటర్ పీయూష్‌చావ్లా



సబ్ రిజిస్ట్రార్ వికాస్‌తో పీయూష్‌చావ్లా

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి సోమవారం భారత క్రికెటర్ పీయూష్‌చావ్లా వచ్చారు. 2011 సంవత్సరంలో జరిగిన ప్రపంచకప్ క్రికెట్ పోటీల్లో శ్రీలంక జట్టుపై విజయం సాధించి ప్రపంచకప్‌ను కైవసం చేసుకున్న భారత జట్టులోని సభ్యుల్లో పీయూష్‌చావ్లా కూడా ఒకరు. అప్పటి జట్టు సభ్యులకు దండుమల్కాపురం, తూప్రాన్‌పేట శివారులోని సుచిరిండియా డెవలపర్స్ సంస్థ వెంచర్‌లో ప్లాట్లు కేటాయించింది. జట్టు సభ్యులు ఒక్కొక్కరికి 266గజాల చొప్పున రిజిస్ట్రేషన్ చేసింది. ఆ ప్లాటును ఇటీవల విక్రయించిన పీయూష్‌చావ్లా కొనుగోలుదారుడికి రిజిస్ట్రేషన్ చేసేందుకు చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. స్థానికులు గుర్తించి సెల్ఫీలు తీసుకున్నారు.

ఆలకించండి మా వేదన

- ప్రజావాణిలో కలెక్టర్‌కు బాధితుల మొర
- వివిధ సమస్యలపై 35 అర్జీలు



భూ సమస్యపై కలెక్టర్‌కు తెలియజేస్తున్న మహిళలు

భువనగిరిటౌన్ : సమస్యలతో సతమతం అవుతున్నాం. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం. మా మొర ఆలకించండి.. సమస్యలు పరిష్కరించండి అంటూ అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి వినతులను స్వీకరించారు. పరిశీలించి ఆయా శాఖల అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 35 అర్జీలు రాగా అత్యధికంగా 28 అర్జీలు రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే ఉన్నాయి.

వక్ఫ్ భూమిని ఆక్రమిస్తున్నారు

రాజాపేట మండలంలోని లక్ష్మక్కపల్లిలో ఉన్న వక్ఫ్ భూమి ఆక్రమణకు గురవుతుందని, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతూ గ్రామానికి చెందిన ముస్లింలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే ముస్లింల శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ ఇవ్వాలి

బస్వాపురం రిజర్వాయర్‌లో బీఎన్‌తిమ్మాపురం పూర్తిగా ముంపునకు గురవుతుంది. ఇళ్లు, వ్యవసాయ భూమి, చిరు వ్యాపారాలు, ఉపాధిని కోల్పోతున్నాం. గ్రామంతో అనుబంధాన్ని కూడా కోల్పోతున్నాం.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి న్యాయం చేయాలని గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్‌కు విన్నవించారు.



బోనమెత్తిన పెద్దగట్టు

నేడు చంద్రపట్నం

జాతరలో మూడవరోజు మంగళవారం చంద్రపట్నం వేసి స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకోసం యాదవ పూజారులు, దేవాలయ అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

లింగమంతుల జాతరకు పోటెత్తిన భక్తులు

- చౌడమ్మ తల్లికి బోనాలు సమర్పించిన యాదవ పూజారులు
- భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్‌లు



దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు జాతరలో భక్తజన సందోహం



జాతరకు గొర్రె పొట్టేళ్లతో వస్తున్న భక్తులు



లింగమంతుల స్వామి దర్శనానికి పెద్దగట్టు పైకివెళ్తున్న భక్తులు

సూర్యాపేట, చివ్వెంల/దురాజ్‌పల్లి : దురాజ్‌పల్లి శ్రీ లింగమంతుల స్వామి(పెద్దగట్టు) జాతరకు సోమవారం భక్తులు పోటెత్తారు. గట్టుకు నలుదిశలా ఉన్న దారుల నుంచి భక్తులు రావడంతో గట్టు అంతా జనంతో నిండిపోయింది. ఒక్కరోజే 8 లక్షలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. స్వామి వారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. జాతరలో రెండవ రోజు ఘట్టమైన చౌడమ్మ బోనాల చెల్లింపు తంతును యాదవ పూజారులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు భేరీ చప్పుళ్లు, మంద గంపలు, బోనాలతో ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో శ్రీలిమంగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్త కుండల్లో నెయ్యి, పసుపు, కుంకుమతో అమ్మవారికి నైవేద్యం వండి, ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి సమర్పించారు.

బోనాల సమర్పణ ప్రత్యేకత..

సంప్రదాయం ప్రకారం.. హక్కుదారులైన మున్న (రాజులు) మెంతబోయిన (పూజరులు) వంశస్తులు తమ ఇళ్ల నుంచి తెచ్చిన బియ్యంతో రెండు (రాశి, సందర) బోనాలు సమర్పించారు. బైకానివారు వాయిద్యాలు వాయిస్తుండగా మున్న వారు రాశిబోనాన్ని, మెంత బోయినవారు సందర బోనాన్ని మద్దెరపోలు ముందర ఇరువైపులా పెట్టారు. రాశి బోనం నుంచి కొంత అన్నం తీసి తమలపాకుల్లో పెట్టి దేవరపెట్టెకు నలుమూలలా ఉంచారు. అలాగే పొడి పసుపుతో వేసిన ముగ్గుపై రెండు తమలపాలకులతో, తడి పసుపుతో వేసిన ముగ్గుపై రెండు తమలపాలకులతో అన్నం నైవేద్యంగా పెట్టారు. మున్న, మెంతబోయిన వారు రాశి బోనం నుంచి కొంత అన్నం తీసి లింగమంతులస్వామి, చౌడమ్మ తల్లికి నైవేద్యంగా పెట్టి మొక్కులు చెల్లించారు. బైకాని వారు మద్దెరపోలు ముందు తెల్లని వస్త్రాన్ని పరిచి దానిపై పసుపుతో చక్రం ఆకారంలో ముగ్గు వేసి ముగ్గుపై నూనె పూసి పసుపు, కుంకుమతో బొట్లు పెట్టి అలంకరించిన రెండు అవసరాలు (కటార్లు) ఉంచారు. వీటిని ముందుగా హక్కుదారులైన మున్న (రాజులు) వంశస్తులు ఐదుగురు వరుసగా ఓ లింగా.. ఓలింగా.. అని స్మరిస్తూ అవసరాలను పైకెత్తి తమ ఛాతీకి ఇరువైపులా ఆనించుకోగా.. బైకాని వారు కథాగానం చేస్తూ మద్దెరపోలు ముందు మున్న, మెంతబోయిన వంశీయులతో దిబ్బం గడుపుట అనే కార్యక్రమం నిర్వహించారు. బైకాని పూజారి ముందుగా మున్న వంశీయుల మెడలో వీరతాడు వేసి స్వామి వైపు ఉన్న దిబ్బం (మట్టి కంచుడు) పైఉంచి మున్నవారు మెడలోని వీరతాడు కొనలు పట్టుకుని, కంచుడు లోని నూనెలో ముంచి, వెలుగుతున్న జ్యోతి చుట్టూ తిప్పి ముద్దెరపోలుకు హస్తాలు ఆనించి మొక్కారు. అలాగే మెంతబోయిన వారు కూడా సౌడమ్మ తల్లి వైపు ఉన్న దిబ్బంపై వంగి, మెడలోని వీరతాడును ఆ దిబ్బం చుట్టూ తిప్పి ముద్దెర పోలుకు హస్తాలు ఆనించి మొక్కారు. ఈ విధంగా బైకాని పూజారులు మున్న, మెంతబోయిన వారి మెడలో వీరతాళ్లు వేసి దిబ్బం మీద ప్రమాణం చేయిస్తే, వారు ఆచారం ప్రకారం లింగమంతుల స్వామి చౌడమ్మ జాతరను నిర్వహిస్తారని నమ్మకం. ముద్దెరపోలు కార్యక్రమం తర్వాత లింగమంతులస్వామి చౌడమ్మ తల్లి ఆలయానికి ఎదురుగా ఉన్న పోచమ్మ పోతరాజుల రాతి విగ్రహాల దగ్గర జంతుబలి కార్యక్రమం నిర్వహించారు. బైకాని వారు కథాగానం చేస్తుండగా తొలి గొర్రె (మెంతబోయిన వారిది), బద్దెపాల గొర్రె (మున్న వారిది), వరద గొర్రె (గొర్ల వారిది)లను చౌడమ్మ తల్లికి ఎదురుగా నిలబెట్టి హక్కుదారులైన మున్న, మెంతబోయిన వారు తమ సంప్రదాయ అవసరాలను గొర్రెలకు ఆనించి మొక్కారు. జడత ఇచ్చిన వెంటనే చౌడమ్మ తల్లికి మొదటగా బైకాని వారు తొలి గొర్రెను కోయగా తర్వాత బద్దె గొర్రెను, వరదగొర్రెను బలిచ్చారు. వరద గొర్రెను కోసేటప్పుడు గొల్లలు బిందెలతో నీళ్ల పోయగా, దాని రక్తం వరదగా ప్రవహించింది. బద్దిపాల గొర్రె రక్తపు చుక్కలను కొత్త కంచుడులో పోసి పాలు, నెయ్యి కలిపి బైకాని వారు మెంతబోయిన వంశీయులలో నిష్టతో ఉన్న వారికి తీర్థంగా పెట్టారు. తర్వాత బలిచ్చిన గొర్రెల మాంసాన్ని మున్న, మెంతబోయిన, బైకాని వారు వాటాలుగా పంచుకుని, తమ విడిది ప్రదేశంలో వండుకుని చౌడమ్మ తల్లికి నైవేద్యం పెట్టి మొక్కి భుజించారు. దీంతో బోనాల సమర్పణ ముగిసింది.



దేవరపెట్టెలో దేవతామూర్తుల విగ్రహాలు

భక్తుల జేబులకు చిల్లు

టెండర్‌లో నిర్ణయించిన ధరకు విరుద్ధంగా వ్యాపారులు జాతరలో తినుబండారాలు, కొబ్బరికాయలు విక్రయించారు. కొబ్బరికాయ టెండర్ ధర రూ.40 కాగా రూ.50కు పైగా విక్రయించారు. మిఠాయి కేజీ రూ.200 , బొంగులు డబ్బా రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. ఎగ్జిబిషన్‌లో సైతం అధిక ధరలు ఉంటుండడంతో నిరాశ చెందుతున్నారు.

జాతరకు కేరాఫ్ మర్రిచెట్టు

పెద్దగట్టు జాతరకు కేరాఫ్‌గా అక్కడి మర్రిచెట్టు నిలుస్తోంది. భక్తులు పెద్ద సంఖ్యలో చెట్టు నీడలో సేదదీరడం కనిపించింది. తప్పిపోయిన వారిని గుర్తించేందుకు వారికి ఒక అడ్రస్‌గా మర్రిచెట్టుగా మారింది. వివిధ శాఖల అధికారులు కలుసుకోవాడానికి వేదికగా మారింది. మొత్తానికి పెద్దగట్టు జాతరకు కేరాఫ్ మర్రి చెట్టు అని భక్తులు పేర్కొంటున్నారు.



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న సిబ్బంది



కటార్లతో విన్యాసాలు చేస్తున్న బాలికలు



ఆలయం లోపల బారులుదీరిన భక్తులు

సాంకేతికతను వినియోగిస్తూ.. భక్తులకు భద్రతనిస్తూ..

- పెద్దగట్టు జాతరలో సీసీ, డ్రోన్ కెమెరాల ఏర్పాటు
- తొలిసారిగా ఎఫ్‌ఆర్‌ఎస్ టెక్నాలజీ వినియోగం
- బందోబస్తును పర్యవేక్షిస్తున్న సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్



సీసీ టీవీలో బందోబసును పర్యవేక్షిస్తున్న ఎస్పీ

సూర్యాపేట క్రైం : రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరగా పేరు గాంచిన శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతరపై పోలీస్ యంత్రాంగం పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది. జాతరలో అల్లరిమూకలు, దొంగల ఆగడాలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం సాయంత్రం వరకు ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ జాతర వద్దే ఉండి బందోబస్తును పర్యవేక్షించారు. జాతరలో మహిళలను వేధించే వారి పట్ల కఠినంగా వ్యవహరించేందుకు షీ టీం, సీసీఎస్‌తో పాటు మఫ్టీ బృందాలు సంచరిస్తున్నాయి. మహిళల పట్ల ఎక్కడైనా అసభ్యకరంగా, అమర్యాదగా ప్రవర్తిస్తే వారిని ఈ బృందాలు అదుపులోకి తీసుకొనున్నాయి. ఈ బృందాల్లోని పోలీసులంతా జాతరకు హాజరయ్యే భక్తుల చుట్టూ తిరుగుతుంటారు. వారితో పాటు బాంబు, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేస్తున్నారు. జాతరలో 60కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జాతర వద్ద ఓ గుడారంలో సీసీ టీవీలకు సంబంధించిన కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్) టెక్నాలజీతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటికి సుమారు 600 మంది పాత నేరస్తుల జాబితాను అనుసంధానం చేశారు. ఎవరైనా పాత నేరస్థులు జాతరలో సంచరిస్తే ఈ నిఘా నేత్రాలు పసిగట్టి కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరవేస్తాయి.

బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర పండుగగా గుర్తిస్తాం

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల

చివ్వెంల (సూర్యాపేట) : బీజేపి అధికారంలోకి రాగానే శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తామని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. జాతరలో భాగంగా రెండవ రోజు గట్టును సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాగానే సమ్మక్క-సారక్క జాతరను తలపించేలా మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తానని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు దేశ రాజకీయాల్లోకి వెళ్లి ఏమి చేస్తారో వేచి చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద కళాకారుల ప్రదర్శన

జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో జాతరలో నిర్వహిస్తున్న జానపద ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. డప్పు కళాకారులు, కోలాట కళాకారులు తమ విన్యాసాలతో భక్తులను మైమరపిస్తున్నారు.



డోలు వాయిస్తూ గట్టుకు వస్తున్న కళాకారులు

ప్రత్యేక ఆకర్షణగా శివసత్తులు



బోనాలతో వస్తున్న శివసత్తులు

జాతరలో శివసత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నెత్తిపై బోనం కుండ ఎత్తుకుని ఓ లింగా నామస్మరణతో నృత్యాలు చేస్తూ జాతరలో సందడి చేశారు. జాతరకు వచ్చిన భక్తులు వారి విన్యాసాలను చూసి మంత్రముగ్ధులయ్యారు.

రాత్రి వరకు తరలివచ్చిన గంపలు

భానుపురి : లింగమంతుల స్వామి జాతరలో ప్రధానంగా మొక్కుల చెల్లింపులో భాగంగా గంపలు చేయడం అనవాయితీ. ఏటా మధ్యాహ్నం వరకే పూర్తయ్యే కార్యక్రమం ఈ సారి రాత్రి 7, 8 గంటల వరకు కూడా గంపలతో కత్తి కటారుల విన్యాసాలతో గట్టుపైకి భక్తులు తరలిరావడం కనిపించింది. యాదవుల సాంప్రదాయ నృత్యాలు, కత్తి కటారు విన్యాసాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.



గంపలతో వస్తున్న మహిళలు



ట్రాక్టర్‌పై ఇళ్లకు వెళ్లపోతున్న భక్తులు

ఒక్క రోజుకే తిరుగు ముఖం

పదేళ్ల క్రితం భక్తులు ఎడ్లబండ్లతో జాతరకు వచ్చి మూడు నుంచి నాలుగు రోజులపాటు గుడారాలతో అక్కడే ఉండేవారు. ఈ ఏడు జాతరకు ఆదివారం సాయంత్రం వచ్చిన భక్తులు గంపలు బోనాలు చేసుకొని స్వామి అమ్మ వాళ్లకు అర్ధరాత్రి వరకు చెల్లించుకున్నారు. ఆ తర్వాత యాటలను బలిచ్చి సోమవారం సాయంత్రానికి ఇంటి ముఖం పట్టడం కనిపించింది.

భక్తులందరికీ రెండు చోట్ల షవర్లు

భక్తులదంరికీ ఆలయ ప్రాంగణంలో రెండు చోట్ల మాత్రమే షవర్లు ఏర్పాటు చేశారు. స్నానాలు చేసేందుకు సరిపడా షవర్లు లేక, ఉన్నవి కూడా ఒకే చోట ఏర్పాటు చేయడంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు.



కోనేరు వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు



కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

ఎరుపెక్కిన గట్టు..

గొల్లగట్టు ఎర్రబడ్డది. యాదవులు స్వామివారికి కొబ్బరి కాయలు, బోనాలు చెల్లించి మొక్కులు చెల్లించుకోగా , అమ్మవారికి యాటలు బలి ఇచ్చారు. గతంలో గట్టుకు ఒకవైపు కేటాయించిన ఒక ప్రదేశంలో మాత్రమే యాటలను బలి ఇచ్చేవారు. కానీ ఈ జాతరలో తమకు నచ్చిన చోట గుట్టచుట్టూ యాటలను బలి ఇచ్చారు. దీంతో గుట్ట పరిసర ప్రాంతాల్లో రక్తపు మరకలే కనిపించాయి.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు

సూర్యాపేట క్రైం : శ్రీ లింగమంతుల స్వామి జాతర సందర్భంగా పోలీసులు జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అందులో భాగంగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. విజయవాడ నుంచి సూర్యాపేట మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనాలను స్వామినారాయణ్ గురుకుల్ స్కూల్ ఎదురుగా ఉన్న ఎస్సారెస్పీ కెనాల్ రోడ్డు మీదుగా ఖమ్మం జాతీయ రహదారి 365బిబి రోళ్లబండ తండా వరకు మళ్లించి, జాతీయ రహదారి రాయినిగూడెం వద్ద యూటర్న్ చేసి హైదరాబాద్ వైపు పంపిస్తున్నారు.

- విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ, ట్రాన్స్‌పోర్టు వాహనాలను కోదాడ, నేరేడుచర్ల, మిర్యాలగూడ, నల్లగొండ మీదుగా నార్కట్‌పల్లి వద్దకు మళ్లిస్తున్నారు.
- కోదాడ, మునగాల, గుంపుల మీదుగా సూర్యాపేట పట్టణానికి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర చిన్న ప్రజా రవాణా వాహనాలు ఎస్సారెస్పీ కెనాల్ నుంచి బీబీగూడెం వద్ద నుంచి సూర్యాపేట పట్టణానికి పంపిస్తున్నారు.
- సూర్యాపేట పట్టణం నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రజా రవాణా వాహనాలు కుడకుడ గ్రామం మీదుగా ఐలాపురం వద్ద ఖమ్మం జాతీయరహదారి మీదుగా రాఘవపురం స్టేజి నుంచి నామవరం గ్రామం మీదుగా జాతీయరహదారి 65 పై గుంజలూరు స్టేజి వరకు మళ్లించి కోదాడ, విజయవాడ వైపునకు పంపిస్తున్నారు. అయితే, జాతరకు వెళ్ల వలసిన భక్తులు బస్సులో వస్తేనే సౌకర్యవంతంగా ఉంటుందని పోలీసులు సూచిస్తున్నారు.



చౌడమ్మకు బోనం సమర్పించేందుకు వస్తున్న మహిళలు



లింగమంతుల స్వామి ఆలయం వెలుపల బారులుదీరిన భక్తులు

భార్యను రోడ్డు దాటించి.. యూటర్న్ తీసుకునేలోపే..

- వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ
- హైవేపై మొక్కలకు నీళ్లు పోసే కూలీ దుర్మరణం
- హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై వంగపల్లిలో ఘటన



ఎల్లేష్ (ఫైల్)



బోల్తాపడిన వాటర్ ట్యాంకర్ కింద ఎల్లేష్ మృతదేహం

యాదగిరిగుట్ట రూరల్: జాతీయ రహదారిపై మొక్కలకు నీళ్ల పోసే ఓ కూలీని ఇసుక లారీ రూపంలో మృత్యువు కబళించింది. భార్యను రోడ్డు దాటించి వాటర్ ట్యాంకర్‌ను యూటర్న్ తీసుకుని వస్తానని చెప్పిన కొద్ది సేపటికే ఇసుక లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం కేసారం గ్రామానికి చెందిన దంపతులు కాశపాక ఎల్లేష్(36), బాలమణి కొన్ని రోజులుగా జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో పెంచుతున్న మొక్కలకు నీళ్లు పోసే కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో రోజువారీలాగే హైవేపై హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్లే వైపున మొక్కలకు నీళ్లు పోసే పని పూర్తి చేసుకున్నారు.

భార్య కళ్లముందే..

పని పూర్తికాగానే దంపతులు ఇంటికి వెళ్లామని అనుకున్నారు. అయితే, భార్యను రోడ్డుకు అవతలి వైపు నిలబడాలని, ట్యాంకర్‌ను యూటర్న్ తీసుకుని వస్తానని చెప్పి ఎల్లేష్ కొద్ది దూరం వెళ్లగానే హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఇసుకలారీ వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ట్యాంకర్ నడుపుతున్న ఎల్లేష్ ఎగిరి కింద పడ్డాడు. ఈ క్రమంలో ట్యాంకర్ అతడి మీదే పడడంతో తీవ్రంగా గాయపడిన ఎల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. అలా తిరిగి వస్తానని చెప్పిన భర్త క్షణాల్లోనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో బాలామణి రోదనలు మిన్నంటాయి. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

కూలీలను వెంటాడుతున్న మృత్యువు

హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై పనిచేసే కూలీలను మృత్యువు వెంటాడుతోంది. గతంలోనూ వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు కూలీలు దుర్మరణం చెందారు.

- **2020 ఆగస్టులో:** యాదగిరిగుట్ట మండలం వంగపల్లి బైపాస్‌లో కొందరు కూలీలు హైవే పనుల్లో భాగంగా ట్రాక్టర్‌లో మట్టిని ఎత్తుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న ట్యాంకర్ కూలీల ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ట్రాక్టర్ మహిళా కూలీలపైకి ఎక్కడంతో స్వరూప (27) సత్తెమ్మ (35) మృతిచెందారు.
- **2022 మార్చిలో:** ఆలేరు పట్టణం బైపాస్ రోడ్డులో కొందరు కూలీలు మొక్కలు నాటేందుకు డివైడర్ మధ్యలో మట్టి నింపుతున్నారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కూలీలను ఢీకొట్టడంతో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.

ముగిసిన పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాలు



శతఘటాభిషేకం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించి ఉత్సవమూర్తులకు అష్టోత్తర శతఘటాభిషేకం చేశారు. ముఖ మండపంలో 108 కలశాలకు పూజలు నిర్వహించి స్వయంభూ, ప్రతిష్ఠామూర్తులను అభిషేకించారు. అనంతరం పూర్ణాహుతి చేపట్టారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో విశేష పూజలు చేపట్టారు. నిత్యాదాయం రూ.24,40,935 సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. యాదాద్రి క్షేత్రాన్ని బాసర జ్ఞాన సరస్వతి ఆలయ ఈఓ విజయరామారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.